ఉద్యోగులను ఎన్నుకోడానికి ఆ యజమాని పెట్టిన వినూత్నపరీక్ష?

# ఇంటర్‌వ్యూ

కె.వరలక్ష్మి కథ

"జెంటిల్‌మెన్, వెల్! మాట యాభైమందిని ఫిల్టర్ చేయగా మీ నలుగురూ తేలారు. మీ నలుగురిలో ఒక్కరికే నేను ఉద్యోగమివ్వబోతున్నాను" ఒక్క క్షణం తనకెదురుగా కూర్చున్న నలుగురివైపు పరిశీలనగా చూశాడు చైర్మన్ ప్రసాద్!

నలుగురి మొహాల్లోనూ ఉత్కంఠ స్పష్టంగా గోచరిస్తోంది. దానికి తోడు ఫలితం ఎలా వుంటుందోనన్న సీరియస్‌నెస్, తమలో ఫలితాన్నిచేజిక్కించుకునే అదృష్టవంతుడెవరో తెలుసుకోవాలన్న ఆతృత తాండవిస్తోంది.

తను వాంఛించిన భావాలుచూసి తృప్తిగా మనసులోనే నవ్వుకున్నాడు ప్రసాద్.

"మా సంస్థ గురించి నే చెప్పవలసిన అవసరంలేదు" అతని ప్రతి పలుకులోనూ హుందాతనం ప్రస్ఫుటమవుతుంది.

"మా సంస్థలో ఉద్యోగమంటే, ప్రభుత్వ ఉద్యోగాలనే వదులుకుని వచ్చి చేరుతున్నారు. అందుక్కారణం మేమిస్తున్న వేతనాలు, ఇతర సదుపాయాలు, ప్రతిభకు మేమిస్తున్న ప్రోత్సాహం క్వాలిఫికేషను బేసిక్‌గా తీసుకున్న ప్రతిభకు పట్టాభిషేకం చేయడంలో మా సంస్థ ప్రథమ స్థానంలో వుంది. అలాగే ప్రతిభ గుర్తించడానికి ప్రతిసారి నూతనమైన విభిన్న మార్గాలనెన్నుకుంటాను. అందులో ఏనాడు పొరపడలేదు. దాని పర్యవసానంగానే మా సంస్థ దేశంలోనే ఒక ప్రత్యేకతను సంతరించుకుని ఆదర్శ సంస్థగాగూడా గుర్తింపు పొందింది. సహజ గంభీర స్వరాన్ని ఆపాడు.

నలుగురు ఒక్కసారి తేరుకుని బరువు దించుకున్నట్లు శ్వాస పీల్చి వదిలారు.



ఇంతలో చైర్మన్ ప్రసాద్ బజ్జర్ నొక్కడమాలస్యం, శుభ్రమైన యూనిఫారంలో ఉన్న ప్యూను — చక్కని ట్రేలో ఖరీదు అయిన గ్లాసుల్లో పండ్లరసం అందించాడు — ఆ నలుగురికి.

"కమాన్ హేవిట్" అన్నాడు ప్రసాద్ చిరునవ్వుతో.

"సర్! మీరూ తీసుకుంటే బాగుంటుం

ది'' నలుగురూ చెప్పాలనుకున్నారు. కాని చెప్పలేదు.

''నన్నుకూడా జ్యాబ్ తీసుకోమని చెప్పా లనుకుంటున్నారు. కాని చెప్పలేకపోతున్నారు ఏం చెబితే ఏమోనని సంశయం. నిజమా'' నవ్వుతూ ప్రశ్నించాడు.

నలుగురూ అదిరిపడ్డారు.

అతని తెలివితేటలు, సునిశిత పరిశీలనా దృష్టి వారికి మరోసారి రుజువైంది.

''అవునన్నట్లు'' తలలాడించారు.

నవ్వి ''నో ఫార్మాలిటీస్! హోవిట్!'' అన్నాడు. సున్నితమైన అధికార దర్పం.

నలుగురూ మౌనంగా త్రాగారు.

ప్యూను గ్లాసులు తీసుకెళ్లాడు.

''ఇప్పుడు విషయంలోకి వద్దాం. బి కంఫర్టబుల్!''

వాళ్ళ బిగుసుకుపోయినట్లు కూర్చోవడం చూసి అన్నాడు.

''ఉన్న పోస్టు ఒక్కటే. మీ నలుగురూ పోటీలో అన్నివిధాలా సమానంగా వచ్చారు. నాకు కావలసిన ఒక వ్యక్తి ఎవరో నిర్ణయించడానికి మీ నలుగురికీ సమాన అవకాశాలు ఇస్తాను. మరి అందులో ఎవరు బెస్టు అని నిరూపించుకుంటారో వారికే అవకాశం — సరేనా'' ప్రశ్నించాడు.

నలుగురూ ''అలాగే''నని అంగీకారం తెలిపారు.

''మీ నలుగురికి తలా పదివేల రూపాయలిస్తాను. ఆరుమాసాలు సమయమిస్తాను. ఆ సమయంలో ఆ పదివేలుఖర్చుపెట్టిరావాలి''

వాళ్ల ఆశ్చర్యానికి అంతులేదు.

''ఆశ్చర్యపోకండి. నే చెప్పవలసింది ఇంకా పూర్తికాలేదు. పదివేలు మీ సరదాలకూ ఇష్టం వచ్చినట్లు ఖర్చుచేయడానికి వీల్లేదు. దేశానికి, సంఘానికి ఉపయోగపడేటట్లు చేయాలి. దాని ఫలితం పది కాలాలపాటు నిలవాలి. ముఖ్యంగా అది ఆదర్శప్రాయమైనదిగా నిలిచిపోవాలి. అలా చేసిన తర్వాత ఆ పనినే ఎన్నుకుని చేయడంలో మీ ఉద్దేశ్యం-దాని ఫలితాల గురించి రిపోర్టు తయారుచేసి ఇవ్వాలి. వాటిని చూసిన తర్వాత నా నిర్ణయం తెలియపరుస్తాను'' తను చెప్పినదానికి వారి రెస్పాన్సు గమనించాడు.

నలుగురిలోను సంతోషఛాయలు కనిపించాయి.

''ఇక్కడ ఇంకో విషయం మీరు గుర్తుంచుకోవాలి. నే చెప్పినట్లుకాక వేరేవిధంగా ఉపయోగిస్తే, పది వేలు తీరేవరకూ ఇక్కడ నేనిచ్చిన ఉద్యోగం చేసి సొమ్ము తీర్చాలి. మొత్తం తీరగానే ఆ ఉద్యోగంనుండికూడా తొలగించేస్తాము. సమ్మతమేనా?'' ప్రశ్నించాడు గంభీరంగా.

సమ్మతమేననట్లు తలలాడించారు.

''నో!'' సీరియస్‌గా అన్నాడు. ''ప్రతిదానికి తలాడిస్తే నేనొప్పుకోను. నోటితో స్పష్టంగా చెప్పాలి''

''అలాగే సర్'' అన్నారు నలుగురూ.

ఇంటర్‌కమ్‌లో పి.ఏని పిలిచాడు ప్రసాద్.

పి.ఏ.వచ్చి నలుగురికీ నాలుగు టైపుచేసిన పేపర్లిచ్చాడు. అందులో చైర్మన్ ప్రసాద్ చెప్పిన విషయాలే వున్నాయి. నలుగురూ సంతకాలు చేసి వారికి ఇచ్చారు.

అవి తీసుకుని ఒకసారి పరిశీలించి, ఒకొక్కక్కరికి పదివేల రూపాయలిచ్చి, కరచాలనం చేసి ''ఆల్ ద బెస్ట్'' అన్నాడు.

వాళ్లు అక్కడినుండి సెలవుతీసుకుని వెళ్లిపోయారు.

తర్వాత తన ఆఫీసులోని విజిలెన్స్ సెల్ నుండి నలుగురు ఉద్యోగులను పిలిచి ఒక్కొక్కరు వెళ్లిన నలుగురిలో ఒక్కొక్కరిని వాళ్లకు తెలియకుండా వాచ్ చేసి ఆర్నెల్ల తర్వాత వాళ్లగురించి వివరాలిమ్మని చెప్పి, మిగతావిషయాలన్నీ వివరంగాచెప్పిపంపాడు.

ఆర్నెల్ల తర్వాత మునుపటిలాగే చైర్మన్ ఛాంబరులో అతనికెదురుగా ఆ నలుగురూ కూర్చుని వున్నారు.

"వెల్! మీ నలుగురిలో ఎవరు నెగ్గేరో తెలుసుకోవాలనే మీ అభిలాష, ఆతృత నాకర్ధమవుతోంది మిమ్మల్ని చూస్తోంటే. మొదటి రాంక్ కుమార్ ది" అంటూ "కంగ్రాట్స్ కుమార్"అని చేయికలిపాడు.

కుమార్ తబ్బిబ్బయిపోయి, అలవిగాని సంతోషంతో "థాంక్యూ సర్" అన్నాడు.


"కుమార్ డబ్బును పూర్తిగా అత్యుత్తమంగా సద్వినియోగం చేశాడు. ఒక మారుమూల గ్రామాన్నెన్నుకుని, అక్కడ చదువు రానివారందరికీ చిన్నా, పెద్దా అన్న తేడా లేకుండా చదువుచెప్పి నూరుశాతం అక్షరాస్యత గ్రామంగా తీర్చిదిద్దాడు. ఆ విషయం మన ప్రభుత్వంకూడా గుర్తించింది.

మనిషి ప్రగతి సాధించాలంటే చదువు అత్యవసరం. అసలు మనిషి మనిషిగా బ్రతకాలంటే చదువే మూలం. అలాంటి కార్యం సాధించాడంటే, ఇంతకుమించిన సమాజ సేవ ఏముంది చెప్పండి" అన్నాడు తన సంతోషాన్ని ప్రకటిస్తూ.

"అవునుసార్ మీరు చెప్పింది నిజం" సమాధానమిచ్చాడు గిరి.

ప్రసాద్ అదే సంతోషంతో గిరిని చూపి "నీవు సాధించినదికూడా గొప్ప విషయమే. కంగ్రాట్స్" అని చేయి ముందుకు చాపి "నీది సెకండ్ ర్యాంక్" అన్నాడు.

గిరి చేతిలో చేయి కలిపి "థాంక్స్ సర్!" అన్నాడు. వెంటనే హరి "ఎక్స్క్యూజ్ మీ సర్! అప్పుడు ఉద్యోగం ఒక్కరికే



అన్నారు. ఇప్పుడేమో సెకండ్ ర్యాంక్ అంటున్నారు'' అస్పష్టంగా అన్నాడు.

''అవును అదే సస్పెన్స్. అప్పుడే మీ నలుగురికి ఉద్యోగాలివ్వాలని నిశ్చయించుకున్నాను. కాని పోటీ మనస్తత్వముంటే తప్ప రాణించలేరని అలా చెప్పాను''

''గిరీ నీవు చేసిందికూడా నిజమైన దేశసేవే! కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేసుకున్న వాళ్లకు ప్రభుత్వమిస్తున్న బహుమతితోపాటు నేనిచ్చిన డబ్బులోనుండి వారికి అదనంగా కొంత సొమ్మిచ్చి ఆపరేషన్ చేయించుకున్నవారిని ప్రోత్సహించి, ఎక్కువమంది ఆపరేషన్లు చేసుకునేటట్లు చేసి, ఈ సంవత్సరానికి ఇచ్చిన 'టార్గెట్'ను గవర్నమెంట్ హాస్పిటలు అధిగమించేట్లు చేశావు. మెడికల్ ఆఫీసరు నీ సేవలు గుర్తించి, నీ సేవలు ప్రశంసిస్తూ ప్రభుత్వానికి ఉత్తరం వ్రాశాడు''

సంతోషంగా కుమార్, గిరివైపు మరోసారి అభినందిస్తూన్నట్లు చూసి, వెంటనే ముఖంలో ఫీలింగ్స్ మార్చేసి హరివైపు నిర్లిప్తంగా చూశాడు.

''హరి! నీవు చేసింది సమాజసేవకాదు. నా డబ్బును నీ స్వార్థానికి... నో... స్వార్థంకాదు స్వంతానికి వాడుకున్నావు. ఆ డబ్బును నీ చెల్లెలి పెండ్లికి ఖర్చుచేశావు. సమాజ సేవకోసమని నేనిచ్చాను. కాని పెండ్లికి వాడావు. నా ఉద్దేశాన్ని నిర్లక్ష్యం చేసినా పెండ్లి అన్నది ఒక శుభకార్యం కాబట్టి నిన్ను తిరస్కరించలేకున్నాను. యూ మస్ట్ ప్రూవ్ బెటర్ ఇన్ ఫ్యూచర్!'' గంభీరంగా అన్నాడు.

''ఎస్ సర్''అన్నాడు వినయంగా హరి.

''మీ ముగ్గురికీ ర్యాంక్స్ బట్ట ఫస్ట్ వన్, టూ, త్రీ స్కేల్సులో ఉద్యోగాలిస్తున్నాను'' అని నాలుగో వ్యక్తివైపు సీరియస్‌గా చూశాడు.

''మీకు తెలుసా ఈ మూర్తి ఏంచేశాడో! ఆ డబ్బుతో గాంబ్లింగ్ ఆడాడు. అందులో డబ్బు సంపాదించి నా మొత్తం నాకిచ్చి వెళ్లిపోవాలనుకున్నాడు. ఉన్నది ఊడింది. విషయం నాకు తెలియదనుకుని డబ్బు దొంగతనమైందని తన రిపోర్టులో వ్రాశాడు. నాకంతా తెలుసు''

నలుగురూ ఆశ్చర్యపోయారు. నిజం ఎలా తెలిసిందో మూర్తికి అంతుబట్టలేదు.

''అందుకే పనిష్మెంట్‌గా మూర్తికి స్వీపరుపని ఇస్తున్నాను. అదికూడా నా మొత్తం తీరేవరకే. ఆ తర్వాత నిర్దాక్షిణ్యంగా వెనక్కి పంపేస్తాను'' అని ఇంటర్‌కమ్‌లో పి.ఏ.ని పిలిచాడు.

అతను వచ్చి నలుగురికీ అపాయింట్‌మెంట్ ఆర్డర్స్ ఇచ్చాడు.

''మీరు మా సంస్థలో ఉద్యోగులుగా చేరుతున్నారు. కాబట్టి మా సంస్థగురించి మీకు కొన్ని విషయాలు చెప్పాలి''

నలుగురూ ఆసక్తిగా చూశారు.

''మా సంస్థ ఉత్పత్తి చేసే వస్తువులు వాటి నాణ్యత, దేశంలో వాటికి వుండే గిరాకీ గురించి నేను చెప్పవలసిన పనిలేదు. అందరికీ తెలుసు. సంస్థలో ఉద్యోగులు వారి పరిస్థితులు, వారికి మా సంస్థ ఇచ్చే ప్రోత్సాహం గురించి మీకు తెలియాలి.

ఇక్కడ సిన్సియారిటీకి హార్డ్‌వర్క్‌కు అత్యున్నత స్థానం ఇవ్వబడుతుంది. అవినీతి, పనిలో అలసత్వం తీవ్రంగా పరిగణించబడు

తుంది. ఈ వివరాలు నాకెప్పటికప్పుడు తెలుస్తూ వుంటాయి. నిర్లక్ష్యాన్ని నేను ఏమాత్రం సహించను.

పనిలో సామర్థ్యాన్నిబట్టి ప్రోత్సాహకాలు వుంటాయి. సామర్థ్యం నిరూపించుకుంటూ ఉన్నత స్థానాలు అధిరోహించాలనుకునే మనస్తత్వంకలవారికి నా ప్రోత్సాహం ఎల్లవేళలా వెన్నంటి వుంటుంది. వారికి పదోన్నతి సమయంలో తగిన గుర్తింపు లభిస్తుంది.

సంస్థ వెల్ఫేర్ ఫండ్‌లోనుండి ఉన్నత చదువులు కోరుకునేవారికి, క్రీడాభిలాష ఉన్నవారికి, ఇతర కళలపట్ల ఆసక్తి ఉన్నవారికి, విజాయితీ ఆధారంగా ఉచిత ధనసహాయం లభిస్తుంది.

చదువు నేర్చుకునేవారికి మీరు మీ తీరిక వేళలలో సహాయం చేయడానికి సంస్థ ఒక స్కూల్‌ను నడుపుతూ వుంది.

కుటుంబనియంత్రణ పాటించడం ఇక్కడ తప్పనిసరి. దానికి సమ్మతించనివారికి కొన్నిసదుపాయాలలో తప్పనిసరి కోతలు వుంటాయి.

అన్నిటికంటె ప్రధానమైనది ఏమిటంటే కట్నం లేకుండా వివాహం చేసుకున్న పురుష ఉద్యోగులకు కొన్ని ప్రత్యేక రాయితీలు కల్పించడం మా సంస్థ ప్రత్యేకత.

ఇవన్నీ నిర్ధారించడానికి ప్రత్యేక విభాగం వున్నది. కాబట్టి ఆషామాషీ పనులకు గుర్తింపు లేదు''

అంతవరకు దీర్ఘంగా చెబుతున్న చైర్మన్ ప్రసాద్ తన మాటలు వారిపై ఎలాంటి ప్రభావాన్ని చూపాయో తిలకించడానికి వాళ్లవైపు పరిశీలనగా చూశాడు.

వారిలో స్పందన అతనికి తృప్తినిచ్చింది.

అలాంటి ఉన్నతమైన, ఉదాత్తమైన, ఉత్తమ సంస్థలో తమకు ఉద్యోగాలు లభించడం అదృష్టంగా వారు భావించారు. ఆ కాంతి వారి కళ్లలో కనిపించింది.

ఛేంబరులోంచి లేచివెళ్తూ ఒక్క క్షణమాగి ''ఆల్ ది బెస్ట్!'' అన్నాడు.

''థాంక్స్ సర్'' అన్నారు వాళ్లు.

మూర్తివైపు తీక్షణంగా చూసి ''కష్టానికి ఇచ్చితమైన ఫలితం వుంటుందిగాని షార్ట్‌కట్ ఫలితాలు జీవితాల్ని తారుమారు చేస్తాయి గుర్తుంచుకో. కేవలం తెలివితేటలుంటే సరిపోదు. వాటిని సద్వినియోగపరచుకోవాలి'' అన్నాడు చైర్మన్ ప్రసాద్.

తెలివితేటల్లో సాటివాడనిపించుకునికూడా చేసిన పనికి సిగ్గుతో తలవచుకోవాల్సివచ్చింది మూర్తికి వారిముందు.

◇ ◆ ◇

